# చింత

-డి.వి.డి.ప్రసాద్

"ఏంటోయ్ రామారావు! ఇంకా పనిలో మునిగి తేలుతున్నావా? అగ్రిమెంట్ సంతకమయిన సంగతి నీకింకా తెలియదా ఏమిటి?'' అన్నాడు కృష్ణమూర్తి, రామారావు సీటు దగ్గరకొచ్చి.

"ఏం అగ్రిమెంటు?'' అన్నాడు రామారావు పరధ్యానంగా ఫైల్లోంచి తలెత్తకుండానే.

"అదేంటోయ్! మనం ఏడాదిగా ఎదురుచూస్తున్న పేరివిజన్ కమిటీ అగ్రిమెంట్ ఇవాళ ఖరారైంది. ఆ సంగతి నీకింకా తెలియదా? మన యూనియన్ వాళ్లు ఫాక్స్ పంపించారు. ఎరియర్స్ వస్తాయని అందరం ఆశతో ఎదురుచూస్తున్నాం కదా మరచిపోయావా? స్టాఫ్ అందరూ క్యాంటిన్‌లో కబుర్లలో మునిగి ఉన్నారు. నీ గురించి వెతికితే నువ్విక్కడున్నావు. పద పద క్యాంటిన్‌కి వెళ్దాం'' అన్నాడు కృష్ణమూర్తి ముందుకు నడుస్తూ.

హఠాత్తుగా ఈ వార్త విన్న రామారావు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. అవును మరి. చాలా రోజులుగా ఎదురుచూస్తున్న ఎరియర్స్ ఇవి. ఇంటికి, ఆఫీసుకి చాలా దూరమవడంవలన బైక్ ఒకటి కొందామని అనుకుంటూనే కొనలేకపోతున్నాడు చాలారోజుల్నుంచి.

ఈ ఎరియర్స్ మీదనే ఆశ పెట్టుకున్నాడు చివరికి. భార్య సరోజకి కూడా బండి కొనాలనే ఉద్దేశ్యం ఉంది. ఆమెకి భర్తతో వారానికి ఒకసారైనా షికారు చేద్దామని ఉంది.

ఆమె కోరిక కూడా తీరబోతోంది. సరిగ్గా ఏడాది ఎరియర్స్ డబ్బులు సరిపోతాయి బైక్ కొనడానికి.

ఆనందంతో సీట్లోంచి లేచి కృష్ణమూర్తిని అనుసరించాడు రామారావు. అతను పనిలో పడి గమనించలేదు కానీ ఆఫీసు హాల్లో ఎవ్వరూలేరు.

క్యాంటిన్‌లోకి అడుగుపెట్టిన రామారావుకి అక్కడ అందరూ గుంపులు గుంపులుగా విడిపోయి కబుర్లలో పడ్డవాళ్ళు కనిపించారు. కొంత మందయితే కాగితాలు ముందేసుకుని ఎరియర్స్ ఎంత వస్తాయోనని కుస్తీ పడుతున్నారు.

"అయితే కృష్ణమూర్తీ! ఎరియర్స్ డబ్బులతో నువ్వేం చేయదలచుకున్నావు?'' అడిగాడు రామారావు టిఫిన్ ప్లేటు ముందుకు లాక్కుంటూ.

"నేనా? నీలాచల్‌నగర్‌లో ప్లాట్ కొంటానురా. ప్లాట్ కొన్న తరువాత బ్యాంక్ లోన్‌కి అప్లై చేస్తాను ఇల్లు కట్టుకోవడానికి. మరి నువ్వేం చేయబోతున్నావు ఎరియర్స్‌తో?'' అడిగాడు కృష్ణమూర్తి.

చెప్పాడు రామారావు.

ఈలోపు వాళ్ల సీట్‌వద్దకు హనుమంతరావు, జగన్నాథం వచ్చారు. వాళ్ళు రావడంతో కుతూహలంగా అడిగాడు కృష్ణమూర్తి.

"మరి హనుమంతరావుగారూ! మీరేం చేయబోతున్నారు రాబోయే ఎరియర్స్‌తో?''

"మా తమ్ముడికి ఇంజనీరింగ్‌లో సీటొచ్చింది. డబ్బులు ఎలా సర్దాలా, ఎక్కడ అప్పు చేయాలా అని తెగ బాధపడుతుంటే ఈ వార్త తెలిసింది. ఇక నాకు ఆ దిగులు మరి ఉండదు. తరువాత తీరిగ్గా ఏదైనా లోన్‌కి అప్లై చేయవచ్చు. మళ్లీ ఖర్చు వచ్చే ఏడాది కదా!ప్రస్తుతానికి నా సమస్య తీరింది'' అన్నాడు హనుమంతరావు.

జగన్నాథం మాత్రం నిట్టూర్చుతూ "మీరందరూ ఏదో ఒక వస్తువు కొంటారో లేక మరే విధంగానైనా ఖర్చు పెడతారోగానీ నాకు మాత్రం ఆ అవకాశం లేదు. చెల్లెలి పెళ్లికి చేసిన అప్పులు అలాగే ఉండిపోయాయి. ఈ ఎరియర్స్ వస్తే బాకీలు తీర్చి రుణ విముక్తుడ్ని అవుతాను'' అన్నాడు.

"పోనీలే. అప్పు తీరడం కూడా ఓ పెద్ద పనే. అప్పులవాళ్ళ పోరు లేకపోతే ప్రాణానికి హాయిగా వుంటుంది. చింత తగ్గుతుంది. కనీసం వడ్డీ భారం నెలనెలా తగ్గుతుంది కదా'' అన్నాడు రామారావు.

"అవునవును. వడ్డీ తగ్గితే జీతంలో మిగులు వుంటుందికదా'' ఒప్పుకున్నాడు జగన్నాథం.

ఇలా కబుర్లతో ఓ గంట ఎలా గడిచిపోయిందో తెలియలేదు.

హఠాత్తుగా వాచీ చూసుకున్నాడు రామారావు.

"అరే చాలా సమయం అయింది మనం వచ్చి. మిగిలిన పని పూర్తి చేసుకుని త్వరగా ఇంటికెళ్లి ఈ శుభవార్త చెప్పాలి'' అన్నాడు. పనిలో సిన్సియర్ మరి రామారావు.

అందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఆఖరికి ఆఫీసులో తాగుబోతు, పేకాట రాయుడు 'రమ్ముదాసు' అని పేరుపడ్డ రాందాసులో కూడా సంతోషం పెల్లుబుకుతోంది. విషయమేమిటంటే అతనికి తాగుడు, పేకాటవల్ల అప్పులు పెరిగిపోయాయి. అవి తీర్చనంతవరకూ కొత్త అప్పులు పుట్టడం గగనమైపోయింది. ఇప్పుడీ ఎరియర్స్ అందగానే అందరికీ బాకీలు తీర్చేసి మళ్లీ తీరుబడిగా అప్పులు మొదలుపెట్టి మజా చేసుకుందామన్న ఉద్దేశ్యంలో ఉన్నాడతను.

'ఎవరి బాధ వారిది. ఎవరి ఆశ వారిది. కోరికలు అనంతం. అవి తీరే అవకాశం వచ్చినప్పుడు ఆశలు వెల్లువవుతాయి. కోరికలకి రెక్కలొస్తాయి. ప్రతివారి ముఖంలో ఆనందం పెల్లుబుకుతోంది' అనుకున్నాడు రామారావు మనసులో.

కృష్ణమూర్తి, రామారావులు క్యాంటిన్‌లోంచి బయటపడుతుండగా అప్పుడు అతని చూపు సంజీవరావుమీద పడింది.

అతనొక్కడూ ఓ మూల ఒంటరిగా కనిపించాడు. అంతేకాకుండా దిగులుగా కూడా ఉన్నాడు. సంజీవరావులాంటి వ్యక్తి ఆ సమయంలో అంత విచారంగా ఎందుకున్నాడో అర్థంకాలేదు రామారావుకి.

సంజీవరావు మంచి స్థితిమంతుడు. ఆర్థికంగా పైమెట్టులో ఉన్నవాడు. తండ్రి ఇచ్చిన ఆస్తిపాస్తులు ఉన్నాయి. పిల్లాజెల్లాలేరు. అయినా అతను డబ్బులు ఖర్చు చేయడంలో ఒకింత పిసినారితనం చూపిస్తాడు. ఎవ్వరికీ ఎప్పుడూ కూడా కాఫీ ఆఫర్ చేసిన పాపాన పోలేదు. ఇంకెవరితోనైనా కలసి టీగానీ కాఫీగానీ తాగినా వాళ్ళు బిల్ పే చేసిన తరువాతే అతను జేబులో చేతులు పెడతాడు. సిటీలో నాలుగైదు ఫ్లాట్స్ ఉన్నాయి సొంత ఇల్లు కాకుండా. అన్నీ అద్దెకిచ్చాడు. రెండు కార్లు టాక్సీలుగా నడుపుతున్నాడు. ఓ అయిదు షాపుల్లో పార్ట్‌నర్‌షిప్ కూడా ఉంది.

సిటీ బయట జాగాలు కొని వాటిని ప్లాట్స్ చేసి అమ్ముతాడు. అంతే కాకుండా వడ్డీలకి డబ్బులు

తిప్పుతాడు కూడా. ఇలా రకరకాల బిజినెస్‌లుగల అతనికి దిగులేమిటి? అందరూ ఆనందంగా ఉంటే అతనెందుకలా డల్‌గా ఉన్నాడు. రామారావుకి అసలేమీ అర్థంకాలేదు.

అతన్ని సమీపించాడు రామారావు.

"ఏం సంజీవరావుగారూ! ఆఫీసులో అందరూ ఎరియర్స్ అందుతాయన్న సంతోషంలో వుంటే, ఎవరెలాగ డబ్బులు ఉపయోగించుకోవాలో అన్న చర్చల్లో వుంటే మీరు మాత్రం దిగులుగా ఉన్నారేంటి? కారణమేమిటి? వ్యాపారంలో నష్టంగానీ ఏమైనా వచ్చిందా?'' అంటూ అడిగాడు.

"ఛ...ఛ...అలాంటిదేమీలేదు. అయితే ఇంతవరకూ నేను ఇన్నిరకాలుగా డబ్బులు ఇన్వెస్ట్ చేసినా ఇప్పుడు రాబోయే డబ్బులు ఏం చేయాలో తేల్చుకోలేకపోతున్నాను. షేర్లలో పెట్టనా? ప్లాట్స్ బిజినెస్‌లో పెట్టనా? వ్యాపారంలో పెట్టనా? పోనీ అదేదో తేలేదాకా బ్యాంక్‌లో డిపాజిట్ చేద్దామంటే ఇప్పటికే చాలా బ్యాంకుల్లో డిపాజిట్లు వున్నాయి. ఇన్‌కమ్ టాక్స్ వాళ్లకి తెలుస్తుందేమోనని మరో భయం. అందుకే ఈ ఎరియర్స్ ఏ విధంగా వాడాలో తేల్చుకోలేకపోతున్నాను. మళ్లీ ఎందులో పెట్టినా లాభసాటిగా వుంటుందోలేదో? అందుకే నాకు ఈ చింతంతా?'' అన్నాడు మరింత దిగులుగా ముఖం పెట్టి.

ఆయన మాటలు విని నివ్వెరపోయారు రామారావు, కృష్ణమూర్తి.

'అవును. అతనికి ఇదో పెద్ద సమస్యే మరి. తమకైతే పరిమితమైన, తమ పరిధిలోగల కోరికలే. అతని కోర్కెలు అనంతం. డబ్బెలా ఉపయోగించుకోవాలా అని అనునిత్యం ఆలోచించేవాడికి ఇది కూడా పెద్ద సమస్యే. పాపం సంజీవరావు!తన డబ్బుని అనుభవించే యోగం అతనికి ఎలాగూ లేదు. కానీ అందరూ చాలా సంతోషంగా ఉన్న వేళలో అతనొక్కడే చింతతో తల్లడిల్లుతున్నాడు' అనుకున్నాడు రామారావు మనసులో.

★

